క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 28న ఉదయం 11 గంటలకు పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి గురువారం తెలిపారు. ఈ సమావేశంలో అజెండాలోని 48 అంశాలపై చర్చించి ఆమోదించడం జరుగుతుందన్నారు. అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు, అధికారులు, హాజరు కావాలన్నారు.

ముగిసిన కౌలు రైతులు గుర్తింపు గ్రామ సభలు



సత్తెనపల్లి: కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు(సీసీఆర్సీ కార్డులు) మంజూరు చేయుటకు సత్తెనపల్లి మండలంలో ఈ నెల 20న ప్రారంభమైన గ్రామ సభలు గురువారంతో ముగిశాయి. గురువారం సత్తెనపల్లి, వడ్డవల్లిలో గ్రామ సభలను నిర్వహించారు. సీసీఆర్సీ కార్డుల వలన కలిగే ఉపయోగాలను రైతులకు వివరించి, రైతుల్లో నెలకొన్న అపోహలను నివృత్తి చేశారు. కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గ్రామ సభల్లో గ్రామ రెవెన్యూ అధికారులు వై.నాగార్జున, ఎస్.అనీల్, ఎంపీఈవో పి.చంద్రకళ, వీఏఏ ప్రశాంత్, కౌలు రైతులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలందరు బడిలో చేరాలి



రాజుపాలెం: బడి బయట పిల్లలందరు బడుల్లో చేరాలని, బాల కార్మికులుగా మారొద్దని ప్రధానోపాధ్యాయులు జి.కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని దేవరంపాడులోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో బడి ఈడు పిల్లలను బాల కార్మికులుగా మార్చొద్దని, బడులకు పంపించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినట్లయితే ఉచితంగా యూనిఫాం, బూట్లు, పుస్తకాలు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ వనజ, వై.శ్రీనివాసరెడ్డి, సీహెచ్ చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో పౌరసేవలను పునరుద్ధరించాలి



సత్తెనపల్లి: గ్రామ/వార్డు సచివాలయాలలో నిలిచిపోయిన పౌరసేవలను వెంటనే పునరుద్ధరించాలని న్యాయవాది నరిశేటి వేణుగోపాల్ గురువారం డిమాండ్ చేశారు. తక్షణమే యుద్ధప్రాతిపదికన వెబ్‌సైట్ అప్‌డేట్ చేయాలన్నారు. నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు, అడంగల్, పలు రకాల సర్టిఫికెట్ల కొరకు పడి గాపులు కాయాల్సి వస్తుందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావటంతో పలు సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్రంలో 2024 అసెంబ్లీ ఎన్నికల అనంతరం నూతన ప్రభుత్వం ఏర్పాటు జరిగిందని, పౌరసేవల నిమిత్తం ఏర్పాటు కాబడిన గ్రామ/వార్డు సచివాలయాలు, మీ సేవ కేంద్రాల వెబ్‌సైట్‌లలో గత ప్రభుత్వ లోగోలు ఉండటంతో సచివాలయం, మీసేవ కేంద్రాల వద్దకు వెళ్లిన వారికి ఇంకా వెబ్‌సైట్ అప్‌డేట్ కాలేదు అని అప్లికేషన్స్ తీసుకోవడానికి నిరాకరిస్తూ వెనక్కి పంపుతున్నారన్నారు. ప్రజలకు, విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లు ఇచ్చే విధంగా తగు చర్యలు తక్షణమే తీసుకోవాలని సంబంధిత అధికారులకు, ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

చిన్నారుల చేరికలే లక్ష్యంగా 'విద్యా ప్రవేశం'

- బుడిబుడి అడుగులు బడివైపే
- 1-8 తరగతుల్లో చేరికలకు ప్రత్యేక డ్రైవ్
- జూలై 25 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, దీక్ష సంయుక్త కార్యాచరణ



అబ్బూరులో ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతపై ర్యాలీ

సత్తెనపల్లి: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం 'విద్యా ప్రవేశం' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ఒకటి నుంచి 8వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో బడి ఈడు చిన్నారులందరినీ చేర్పించేలా ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్ష, దీక్ష సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేసేందుకు షెడ్యూల్ విడుదల చేశారు. నాలుగు వారాల పాటు చేపట్టే ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా తరగతులలో బడి ఈడు చిన్నారులను బడిలో చేర్పించేందుకు పాఠశాల పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయులు కలిసి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నారు.

విద్యార్థుల చేరికలే లక్ష్యం

బడి బయట విద్యార్థులను బడిలో చేర్పించేందుకు ఇప్పటికే 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్ష అభియాన్ చేపట్టింది. తాజాగా విద్యా ప్రవేశం కార్యక్రమం కింద పాఠశాల ఆవాస ప్రాంతాల్లో ఉన్న బడి ఈడు చిన్నారులను గుర్తించి వారి వివరాలు సేకరించి బడిలో చేర్పించాలి. ఈ కార్యక్రమ నిర్వహణకు దీక్ష ప్లాట్‌ఫామ్‌ను వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు

ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని దశల్లో పర్యవేక్షణ చేయాల్సి ఉంది. ముందుగా ఈ నెల 24 నుంచి జూలై 12 వరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను పాఠశాల స్థాయిలో నిర్వహించాలి. ఈ కార్యక్రమాన్ని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారు. జిల్లా, మండల స్థాయి విద్యా శాఖ అధికారులు తరచుగా పాఠశాలలు సందర్శించాలి. విద్యార్థుల అడ్మిషన్లు జరిగే పాఠశాలలను తరచుగా సందర్శించి అడ్మిషన్ ప్రక్రియను నిశితంగా పరిశీలించాలి. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సహకారంతో ఇంటింటికి తిరుగుతూ విద్య వల్ల కలిగే లాభాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలపై పిల్లలతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలకు పంపేలా చర్యలు తీసుకోనున్నారు.



అబ్బూరు (ఎల్ఈ) పాఠశాలలో చేర్చుకొని అడ్మిషన్ పత్రం ఇస్తున్న ఉపాధ్యాయుడు

ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను వివరిస్తూ..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను వివరిస్తూ అధికారులు, ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాల్సి ఉంది. పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న స్టూడెంట్ కిట్లు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, చక్కని వసతి సౌకర్యాలు, డిజిటల్ విద్య తదితర సౌకర్యాలను తల్లిదండ్రులకు తెలియపరచాల్సి ఉంది. మొదటి దశ ఈ నెల 24 నుంచి 27 వరకు నమోదు పెంపునకు అందుబాటులో ఉన్న అభ్యసన మూలాలను పరిశీలించాలి. ఈ నెల 28 నుంచి జూలై 25 వరకు మండల, డివిజన్, జిల్లా స్థాయి ప్రణాళిక నిర్వహిస్తారు. ఈ దశలో పాఠశాలలను అధికారులు సందర్శించడం, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌కు ఏం చర్యలు తీసుకున్నారో పరిశీలించడం, అడ్మిషన్ల ప్రక్రియపై వివిధ స్థాయిల్లో సమీక్ష నిర్వహిస్తారు. అధికంగా ఎన్‌రోల్‌మెంట్ చేసిన ప్రధానోపాధ్యాయులను గుర్తిస్తారు. గడచిన ఐదేళ్లలో ఆయా పాఠశాలల్లో నమోదైన అడ్మిషన్ల వివరాలను పరిశీలించి విశ్లేషిస్తారు. అలాగే పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులతో సమావేశమై చేరికలపై నివేదిక తయారుచేసి అడ్మిషన్ల పెరుగుదలపై సమీక్షిస్తారు. దీక్ష ప్లాట్‌ఫామ్ ద్వారా మూడు దశల్లో పర్యవేక్షిస్తారు. విద్యా ప్రవేశం ద్వారా పరిశీలించి, గమనించిన అంశాలను అధ్యయనం చేస్తారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి అధికారులు మూడు పోస్టర్లను వాట్సాప్ గ్రూపుల ద్వారా విడుదల చేశారు.



రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన 'విద్యా ప్రవేశం' పోస్టర్

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



బడి ఈడు పిల్లలు అందరూ బడిలోనే ఉండాలి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా ప్రవేశం కొత్త కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలి. ఇప్పటికే బడి బయట చిన్నారులను గుర్తించేందుకు 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి.

–ఎ.శ్రీనివాసరావు, ఎంఈవో, సత్తెనపల్లి

హ్యూమన్ రైట్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తాం



రాజుపాలెం: నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా జిల్లా కార్యవర్గ సమావేశం మండలంలోని కొండమోడు సమీపంలోని వీరమ్మ కాలనీలో దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ అధ్యక్షులు గరికపాటి శంకరరావు మాట్లాడుతూ జిల్లా కేంద్రం నరసరావుపేటలో కార్యాలయం ఏర్పాటుకు తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశాలు అన్ని మండల కేంద్రాలలోను, నియోజకవర్గాలలోను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.కుమార్, కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు, కోటా బాబూరావు, జాలా వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బాలుర గురుకులంలో ప్రవేశ పరీక్ష

సత్తెనపల్లి: మండలంలోని రామకృష్ణాపురంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 28న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఒట్టిప్రోలు జాన్సన్ గురువారం తెలిపారు. నిబంధనల ప్రకారం ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కులు, తదితర వాటి ఆధారంగా ఆయా తరగతుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేయడం జరుగుతుందన్నారు.

పంట సాగు పత్రాలతో ప్రయోజనాలు పొందండి

- మండలంలో 2,063 కౌలు కార్డులు లక్ష్యం.. 332 దరఖాస్తుల స్వీకరణ
- కొనసాగుతున్న కౌలుకార్డుల దరఖాస్తుల ప్రక్రియ



దొడ్లేరు ఆర్బీకేలో కౌలు గుర్తింపు కార్డుల గ్రామ సభ

దొడ్లేరు(క్రోసూరు): పంటలు కౌలుకు సాగు చేసే రైతులు కౌలు గుర్తింపు కార్డులు పొంది పంట సాగు ప్రయోజనాలు పొందాలని ఏవో వేణుగోపాల్ గురువారం కౌలు సాగు రైతులకు పిలుపునిచ్చారు. మండలంలోని దొడ్లేరు, ఆవులవారిపాలెం గ్రామాల్లోని ఆర్బీకేల్లో నిర్వహించిన గ్రామ సభల్లో ఆయన కౌలు రైతులకు కౌలు కార్డులపై అవగాహన కల్పించారు. ప్రతి కౌలు సాగుదారుడు దరఖాస్తు చేసుకుని కౌలు కార్డులు పొందాలన్నారు. కౌలు కార్డుల వలన రైతులు మద్దతు ధరకు ఈ క్రాపింగ్ ద్వారా తమ పంట విక్రయించుకునే సౌలభ్యం ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు పంట బీమా వర్తిస్తుందని, ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తుందని తెలియజేశారు. అంతేకాక బ్యాంకుల ద్వారా పంటపై రుణాలు పొందేందుకు వీలుపడుతుందన్నారు. కావున కౌలు సాగుదారులు తప్పనిసరిగా స్థానిక రెవెన్యూ అధికారికి కౌలు కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 2,063 కౌలు కార్డులు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 332 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, ఏఏవోలు, రైతులు పాల్గొన్నారు.

అతిసార నివారణపై అవగాహన అవసరం

ఎంపీడీవో భవనం వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి, ఎంపీడీవో

బెల్లంకొండ: అతిసార వ్యాధి నివారణపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో భవనం వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని న్యూచిట్యాలలో అతిసార నివారణపై మండలంలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమయిన తరుణంలో ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలతో పాటు, కలుషిత నీరు తాగి ప్రజలు వాంతులు, విరేచనాల బారిన పడకుండా చూడాలని తెలిపారు. గ్రామ స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలతో, ఉపాధి హామీ గ్రూపు సభ్యులకు, డ్వాక్రా సభ్యులకు, ప్రజలకు ఏవిధంగా అవగాహన కల్పించాలో వివరించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కె.వి.కోటేశ్వరరావు మాట్లాడుతూ సబ్బుతో చేతులు కడుక్కోవడం, సురక్షితమైన తాగు నీటిని ఉపయోగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటివి చేయాలన్నారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు ప్రతి హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో డయేరియా నుంచి పిల్లలను కాపాడుకునేందుకు ఓఆర్ఎస్ ద్రావణ ప్యాకెట్లు, జింక్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బాలసుందరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ, పీహెచ్‌సీ సిబ్బంది, వివిధ గ్రామాల అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబా మందిరంలో అన్నదానం



క్రోసూరు: క్రోసూరులోని షిర్డీ సాయిబాబా మందిరంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురువారం సాయిబాబాకు అత్యంత ప్రీతిపాత్రమైన రోజు సందర్భంగా ప్రతి గురువారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నెం వెంకట్రావు తెలిపారు. ఉదయం మందిరంలో కాకడ హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆశేషంగా పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్ ప్రక్రియ పరిశీలన



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో జరుగుతున్న అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ ప్రక్రియను జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ గురువారం పరిశీలించారు. 60 సంవత్సరాలు పైబడిన వారందరికీ వ్యాక్సిన్ అందించాలని ఆయన సూచించారు. షుగర్ వ్యాధి ఉన్నప్పటికీ వ్యాక్సిన్ అందించవచ్చన్నారు. వైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేసిన తర్వాత అర్ధగంట వరకు పర్యవేక్షణలో ఉంచుకోవాలన్నారు. 18 సంవత్సరాలు దాటిన తర్వాత పొగాకు ఉత్పత్తులు వాడే వారికి, టీబీ పేషంట్స్‌కు వ్యాక్సిన్ అందించాలన్నారు. 85 మందికి వ్యాక్సిన్ అందించినట్లు ఆయన తెలిపారు. అలాగే 60 మందికి సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించటం జరిగిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో పీహెచ్‌సీ వైద్యురాలు పి.రమాదేవి, సూపర్‌వైజర్ ఎం.జోస్పిన్‌రాణి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగంటివారిపాలెంలో ఆయుర్వేద వైద్య శిబిరం



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో జెరియాట్రిక్ క్యాంపు గురువారం నిర్వహించారు. శిబిరంలో మండల ఆయుర్వేద వైద్యశాల వైద్యులు పి.సరళ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. వృద్ధులకు బీపీ, షుగర్, ఆయాసం, కిడ్నీ సమస్యలు, మోకాళ్ల నొప్పులు వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించినట్లు వైద్యురాలు సరళ తెలిపారు. మొత్తం 122 మందికి వైద్య సేవలందించామన్నారు. దీర్ఘకాలికంగా నయం కాని వ్యాధులను సైతం ఆయుర్వేద వైద్యం ద్వారా నయం చేసుకోవచ్చని, మండల వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో కాంపౌండర్ సునీత, అటెండర్ రమేష్, యోగా ఇన్‌స్ట్రక్టర్ సరిత, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కృషి చేస్తుంది



జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను సత్కరిస్తున్న పెదకూరపాడు తాలూకా సభ్యులు

పెదకూరపాడు: ఉద్యోగుల సమస్యలపై ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి శెట్టి సతీష్‌కుమార్‌లు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ పెదకూరపాడు తాలూకా సమావేశం తాలూకా అధ్యక్షుడు విజయకుమార్, కార్యదర్శి శ్రీనివాసరావుల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించుకునేందుకు అందరూ సంఘటితంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో తాలూకా సహ అధ్యక్షుడు వెంకట్రావు, ఉపాధ్యక్షుడు సుబ్బారావు, పెదకాబాబు, వెంకట్రావు, సహాయ కార్యదర్శి నరసింహారావు, యుగంధర్, నితిన్, దిలీప్‌కుమార్, మహిళ సంయుక్త కార్యదర్శి సుశీల, కోశాధికారి ఏడుకొండలు పాల్గొన్నారు.

సీసీఆర్సీ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి



కౌలు రైతుల సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి

రాజుపాలెం: ప్రతి కౌలు రైతు కౌలు కార్డు కొరకు రైతు భరోసా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య తెలిపారు. రాజుపాలెం గ్రామ సచివాలయంలో కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులపై అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ కౌలు రైతు కార్డు కొరకు భూ యజమాని పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్ కాపీ, కౌలు రైతు పాస్‌పోర్ట్ ఫొటో, దరఖాస్తు పూర్తి చేసి స్థానిక రైతు భరోసా కేంద్రంలో అందజేయాలని తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల వీఆర్వోలను సంప్రదించాలని తెలిపారు. కార్డులు పొందిన రైతులకు బ్యాంక్ రుణాలు, పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకొనుటకు, పంట బీమా, పంట నష్టపరిహారం, పంట నమోదు తదితర ఉపయోగాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వాసు, వీఆర్వో శిరీష, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

ఏడీఏ బత్తుల శ్రీకృష్ణదేవరాయలు



విత్తనాల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ

బెల్లంకొండ: రైతులకు విత్తన దుకాణాల యజమానులు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని పిడుగురాళ్ల డివిజన్ ఏడీఏ బత్తుల శ్రీ కృష్ణదేవరాయలు తెలిపారు. గురువారం మండలంలోని పలు విత్తనాల దుకాణాలను ఏవో డి.కృష్ణయ్యతో కలిసి ఆయన తనిఖీ చేశారు. విత్తనాల దుకాణాల యజమానులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ప్రభుత్వం ధ్రువీకరించిన విత్తన రకాలు మాత్రమే అమ్మకాలు జరపాలని, గరిష్ట చిల్లర ధరకి మించి అమ్మరాదన్నారు. ప్రతి విత్తన కొనుగోలు దారునికి విధిగా బిల్లు ఇస్తూ బిల్లుపై పంట రకం, లాట్ నెంబర్, తేదీ, డీలరు, రైతు సంతకం ఉండేలా చూడాలని తెలిపారు. రైతులు పంట వేసిన తర్వాత ఖాళీ విత్తన ప్యాకెట్‌లు, బిల్లులు భద్రపరచుకోవాలని సూచించారు. ఏవో కృష్ణయ్య మాట్లాడుతూ భూమిలో సరిపడా పదును ఉన్నప్పుడు విత్తుకుంటే సరైన మొక్కల సాంద్రత ఉండేలా చూసుకోవచ్చని తెలిపారు. పత్తి ఒక కిలో విత్తనానికి ట్రైకోడెర్మా 8 గ్రాముల చొప్పున కలిపి విత్తన శుద్ధి చేసుకుని నాటాలని తెలిపారు. తద్వారా వేరు కుళ్లు, ఎండు తెగులు నివారించుకోవచ్చన్నారు. డీలర్లు అనధికార విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కనపర్రులో స్టూడెంట్ కిట్ల పంపిణీ

నాదెండ్ల: కనపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి గ్రామ టీడీపీ నాయకులు వజ్జా సింగయ్య, మల్లవరపు జయప్రసాద్, నరిశెట్టి చిన్నయ్య, షేక్ ఖాజామొహిద్దీన్‌లు విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో స్టూడెంట్ కిట్లు అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అందించే వసతులు వినియోగించి విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

తల్లీ.. వర్షించు!!





వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు మంచి దిగుబడులు రావాలని రైతులు గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. సాతులూరు గ్రామంలో కొలువైయున్న పోలేరమ్మ, మునిబందమ్మ, వినుకొండ అంకమ్మ, ఊర అంకమ్మ, మహాలక్ష్మమ్మ, రెడ్డిపేరంటాలమ్మ తల్లి, బొడ్డురాయిలకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. అన్ని ఆలయాల్లో అమ్మవార్లకు బిందెలతో జలాభిషేకం చేశారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. ఖరీఫ్ ప్రారంభమైనా రోజురోజుకు వర్షాభావ పరిస్థితులు నెలకొనటం, పగటి ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో ఉంటున్నాయని, వాతావరణం చల్లబడి మంచి వర్షాలు కురవాలని మొక్కుకున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభించుకునేలా కరుణించాలని కోరుకున్నారు.

–నాదెండ్ల

తురిమెళ్లలో ఘనంగా ఆలయ వార్షికోత్సవం



రొంపిచర్ల: మండలంలోని తురిమెళ్ల గ్రామంలో కొలువై ఉన్న వరద ఆంజనేయ స్వామి వారి దేవాలయ పదకొండవ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రామశేషగిరిరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథ శర్మ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళా భక్తులు ఆలయావరణలో పొంగళ్లు పొంగించి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వందలాదిమంది భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.